కాయ్ రాజా కాయ్ !

- యథేచ్ఛగా కోడి పందేలు, గుండాట, జూదం
- రికార్డు స్థాయిలో బరులు
- నరసాపురం చరిత్రలో ఎన్నడూ లేని వైనం
- తొలి రోజు చేతులు మారిన రూ.10 కోట్లు

నరసాపురం: సంక్రాంతి పేరు చెప్పి ఈ ఏడాది నరసాపురం చరిత్రలో లేని విధంగా జూదాలు పురి విప్పాయి. కూటమి నేతల కనుసన్నల్లో ఇష్టానుసారం కోడి పందేల మాటున పేకాట, గుండాట, జూదాలు నిర్వహించారు. ప్రతీ సందులో బరి అన్నట్టుగా ఏర్పాటు చేసి యువతను పెడదోవ పట్టించారు. గుండాట బోర్డుల వద్ద మైనర్లు పెద్ద సంఖ్యలో కనిపించడం విశేషం. ఇంత జరుగుతున్నా పోలీసులు కనీసం ప్రేక్షకపాత్ర కూడా పోషించకుండా, ఎక్కడ ఉన్నారో కూడా తెలియదన్నట్టుగా వ్యవహరించారు. పోలీసులు పండుగ ముందు నుంచి హడావుడి చేసినా అసలు సమయం వచ్చే సరికి ఏమీ పట్టనట్టు వదిలేశారు. దీంతో సోమవారం పట్టణంలో వీవర్‌కాలనీ, గవర్నమెంట్ ఆసుపత్రి వెనుక, పీచుపాలెం, రుస్తుంబాద ప్రాంతాలతో పాటుగా నరసాపురం, మొగల్తూరు మండలాల్లోని పలు గ్రామాల్లో పెద్దపెద్ద బరులు కట్టి ఆటలు నిర్వహించారు. పట్టణంలో మొత్తం 12 చోట్ల, నరసాపురం మండలంలో 20 చోట్ల, మొగల్తూరు మండలంలో 22 చోట్ల బరులు ఏర్పాటు చేశారు. పట్టణంలోని వీవర్స్‌కాలనీ, రుస్తుంబాద, పీచుపాలెం, లక్ష్మణేశ్వరం ప్రాంతాల్లో నిర్వాహకులు పెద్దపెద్ద బరులు సిద్ధం చేసి ఆటలు నిర్వహించారు. భోగి రోజు ఒక్క రోజే నరసాపురం ప్రాంతంలో రూ.10 కోట్లు చేతులు మారినట్టు అంచనా. డివిజన్ కేంద్రమైన నరసాపురంలో ఎక్కడా కూడా పోలీసు వారి ఆచూకీ కనిపించకపోవడం అటుంచితే రెవెన్యూ అధికారులు కూడా పట్టించుకోకపోవడంపై విమర్శలు వస్తున్నాయి.



నరసాపురం: బరిలో తలపడుతున్న కోళ్లు

యథేచ్ఛగా పందేలు

నరసాపురం రూరల్: కోడిపందాల రాయుళ్ల మాటే నెగ్గింది. పందేలకు అనుమతిచ్చేది లేదంటూ పోలీసులు చేసిన ప్రకటనలు చూసి జనం నవ్వుకుంటున్నారు. ఎందుకంటే ప్రతి ఏడాది ఇటువంటి ప్రకటనలు ఇవ్వడం సంక్రాంతి మూడు రోజులు చూసీ చూడనట్లు వదిలేయడం అలవాటుగా మారడంతో అటు పందెం రాయుళ్లు, ఇటు నిర్వాహకులు ఎప్పటిలానే పందేలు నిర్వహించారు. సోమవారం ఉదయం నుంచి గ్రామాల్లో సందడి నెలకొంది. లక్ష్మణేశ్వరం, వేములదీవి, రుస్తుంబాద, పితానిమెరక, కొప్పర్రు, లిఖితపూడి, చిట్టవరం, తూర్పుతాళ్లు గ్రామాల్లో కోడి పందేలు నిర్వహించారు. పట్టణంలో పలు ప్రాంతాల్లో భారీ ఏర్పాట్లు చేసి సంక్రాంతి సంబరాల మాటున గుండాటలు, పేకాటలు ఏర్పాటు చేశారు. మద్యం ఏరులై పారింది.

జోరుగా గుండాట

యలమంచిలి: సంప్రదాయం పేరుతో మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం జూద క్రీడలు జోరుగా సాగాయి. ఉదయం నుంచే కోడి పందేలతో పాటు, గుండాట, పేకాట, కోతాట వంటి జూద క్రీడలు పెద్ద ఎత్తున నిర్వహించారు. కలగంపూడి, గుంపర్రు, మట్లపాలెం, యలమంచిలి, కాజ, వడ్డిలంక, కొంతేరు, మేడపాడు, కనకాయలంక, బూరుగుపల్లి గ్రామాలలో జూద క్రీడలు నిర్వహించారు. పందేల వద్దకు జూదగాళ్లను ఆకర్షించేందుకు టీవీ కళాకారులతో మ్యూజికల్ నైట్స్, జబర్దస్త్ కామెడీ స్కిట్స్ ఏర్పాటు చేయడంతో పాటు కొన్ని గ్రామాల్లో విందు భోజనాలు పెట్టారు. హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై, ముంబై వంటి మహానగరాల నుంచి వచ్చిన యువకులతోపాటు విదేశీయులు కూడా పెద్ద సంఖ్యలో జూద క్రీడల్లో పాల్గొన్నారు. మొదటిరోజునే జూద క్రీడల్లో లక్షలాది రూపాయిలు చేతులు మారాయి.

పందేలకు కాపలాగా బౌన్సర్లు

పాలకొల్లు అర్బన్: సంక్రాంతి సాంప్రదాయం పేరుతో కోడి పందేలు జోరుగా సాగుతున్నాయి. మండలంలోని గొల్లవానిచెరువు, వడ్లవానిపాలెం, చింతపర్రు, పూలపల్లి, లంకలకోడేరు, దగ్గులూరు, శివదేవుని చిక్కాల, తిల్లపూడి, వాలమర్రు గ్రామాల్లో కోడి పందేలు జోరుగా సాగుతున్నాయి. పూలపల్లి, వడ్లవానిపాలెం పందాలు లక్షల్లో సాగుతున్నాయి. కోడి పందేల శిబిరాల వద్ద గుండాట, పేకాట యథేచ్ఛగా సాగుతున్నాయి. అలాగే శిబిరాల వద్ద మద్యం, ఇతర తినుబండారాల దుకాణాలు కూడా ఏర్పాటు చేశారు.

పెరిగిన కోజా డిమాండ్

పందెంలో ఓడిపోయిన పుంజుని కోజాగా పిలుస్తారు. ఈ కోజాకి బాగా డిమాండ్ ఉంది. ప్రస్తుతం రూ.5 వేల ధర పలుకుతోంది. పుంజుని జీడిపప్పు, బాదం పప్పుతో మేత వేసి పెంచుతారు. దీంతో కోజా రుచికరంగా ఉంటుంది. మాంసం ప్రియులు కోజా అంటే ఇష్టంగా తింటారు.

కాపలాగా బౌన్సర్లు..

కోడి పందేల శిబిరాల వద్ద కాపలాగా బౌన్సర్లను ఏర్పాటు చేశారు. వీరిని రాజమండ్రి, విశాఖపట్టణం తదితర ప్రాంతాల నుంచి పందెం నిర్వాహకులు రప్పించారు.



పందేల వద్ద కాపలాగా బౌన్సర్లు

పందెం కోడి గెలిచింది

పెనుగొండ: సంక్రాంతి పండుగ సందర్భంగా కోడి పందేలు, జూదం నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవంటూ అధికారులు చేసిన హెచ్చరికలు గాల్లో కలిసిపోయాయి. చివరకు పందెం కోడి గెలిచింది. పెనుగొండ మండలంలో సిద్ధాంతం, పెళ్లికూతురు చెరువు తదితర గ్రామాల్లో సోమవారం ఉదయం నుంచి బరుల్లో కోడి పందేలు, గుండాట, పేకాట జోరుగా సాగాయి. బరుల సమీపంలోనే మద్యం అమ్మకాలు యథేచ్ఛగా సాగాయి. సిద్ధాంతం గుండాటల్లో ఇతర ప్రాంతాల వారు ఎక్కువగా పాల్గొనడంతో స్వల్ప వివాదాలు చోటు చేసుకున్నాయి.



నరసాపురం రూరల్: కోడి పందేలు నిర్వహిస్తున్న పందెం రాయుళ్లు



నరసాపురం రూరల్: లక్ష్మణేశ్వరంలో నిర్వహిస్తున్న గుండాట



యలమంచిలి: రాత్రి సమయంలో జోరుగా సాగుతున్న గుండాట

క్లుప్తంగా

భోగి మంటల్లో విద్యుత్ బిల్లుల దహనం



విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

పోడూరు: ట్రూఅప్ చార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పోడూరు మండలంలోని పోడూరు, పండితవిల్లూరు, తూర్పుపాలెం గ్రామాల్లో సోమవారం సీపీఎం నాయకులు భోగి మంటల్లో విద్యుత్ బిల్లులను దహనం చేసి వినూత్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి కాకర వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యుత్ చార్జీలు పెంచమని సీఎం చంద్రబాబు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని అమలు చేయకపోవడం వలన ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే ఆ హామీని అమలు చేయడంతో పాటు స్మార్ట్ మీటర్ల బిగింపును ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బూరాబత్తుల వెంకట్రావు, బొంతు శ్రీను, మూడే మోజెస్, కె.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

రాజగోపాల స్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు

మొగల్తూరు: గ్రామంలో వేంచేసియున్న శ్రీరామాలయ, రుక్మిణీ సత్యభామా సమేత రాజగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం ఉదయం గోదా రంగనాథుల తిరు కల్యాణ మహోత్సవాన్ని ఆలయ అర్చకులు సుదర్శనం లక్ష్మీ నరసింహాచార్యులు, రామశేసు, రామకుమార్ ఆచార్యులు ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సంప్రదాయ పండుగ సంక్రాంతి



భోగి మంట వెలిగిస్తున్న అదనపు సివిల్ జడ్జి

పాలకొల్లు అర్బన్: తెలుగింటి సంప్రదాయ పండుగ సంక్రాంతి అని పాలకొల్లు కోర్టు అదనపు సివిల్ జడ్జి లక్ష్మీ లావణ్య అన్నారు. పంచారామ క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం భోగి పండుగ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. అనంతరం భోగి మంటను లక్ష్మీ లావణ్య వెలిగించారు.

ఘనంగా గోదాదేవి కల్యాణోత్సవాలు



పెనుమంట్ర: గోదాదేవి కల్యాణం నిర్వహిస్తున్న ఎంపీపీ దంపతులు



యలమంచిలి: గోదాదేవి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు

నరసాపురం రూరల్: మండలంలోని వేములదీవి కాపులకొడపలో వేంకటేశ్వరస్వామి వారి, పసలదీవి కోదండ రామాలయాల్లో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా సోమవారం గోదాదేవి కల్యాణం ఘనంగా నిర్వహించారు. పసలదీవి గ్రామంలో నెల రోజుల నుంచి తిరుప్పావై ప్రవచనాలను ముడుంబై వెంకటాచార్యులు చెబుతున్నారు. భగవద్గీతలో శ్రీకృష్ణుడు చెప్పిన విధంగా మార్గశిర మాసంలో చేసే వ్రతం సత్ఫలితాలను ఇస్తుందని ఆయన చెప్పారు. గోదా దేవికి ఊంజల్ సేవను నిర్వహించి కల్యాణ ఘట్టాన్ని వైభవంగా నిర్వహించారు. పూర్వం నుంచి పసలదీవి ప్రాంతంలో చక్రాంతకాలు ధరింపచేసిన భక్తులు దీక్షతో ధనుర్మాస వ్రతాన్ని ఆచరిస్తున్నారు. నిత్యం జరుగుతున్న తిరుప్పావై ప్రవచనం వల్ల గోదాదేవి సాక్షాత్తు భూమాత కావున ఈ దేవత రుణం తీర్చుకునే అవకాశం స్థానికులకు కలిగిందని భక్తులు ఆనందంగా చెబుతున్నారు. భోగి పండుగ రోజైన శుక్రవారం వేములదీవి వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో శ్రీమాన్ పెద్దింటి అరుణ్‌కుమారాచార్యులు ఆధ్వర్యంలో గోదాదేవి కల్యాణాన్ని నిర్వహించారు. అలాగే సంక్రాంతి పండుగ రోజు రాత్రి కూడా విశేష పూజలు నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నరసాపురం మండల అధ్యక్షుడు ఉంగరాల రమేష్ నాయుడు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అన్న సమారాధనను నిర్వహించారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

పెనుమంట్ర: మండలంలో సోమరాజు ఇల్లిందలపర్రులో వేంచేసియున్న శ్రీరుక్మిణీ సత్యభామా సమేత శ్రీవేణుగోపాలస్వామి వారి ఆలయంలో ధనుర్మాసం సందర్భంగా ఎంపీపీ కర్రి వెంకటనారాయణరెడ్డి, రాధా దంపతులు సోమవారం శ్రీరంగనాథస్వామి, గోదాదేవి కల్యాణం నిర్వహించారు. ముందుగా స్వామి వారికి పంచామృతాలు నిర్వహించి పుష్పాలు, తులసీ దళాలతో అర్చనలు చేశారు. వేద పండితులు పెదపూడి విజయ్ వెంకటరమణ ఆధ్వర్యంలో కల్యాణోత్సం నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని, స్వామివారిని దర్శించుకున్నారు.



నరసాపురం రూరల్: పూజలు నిర్వహిస్తున్న రమేష్ దంపతులు

ముగిసిన ధనుర్మాస పూజలు

యలమంచిలి: గుంపర్రులోని శ్రీభూసమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గత నెల రోజులుగా జరుగుతున్న ధనుర్మాస పూజలు సోమవారం గోదాదేవి కల్యాణంతో ముగిశాయి. ఆలయ అర్చకులు ఖండవల్లి సీతారామభార్గవ బ్రహ్మత్వంలో గ్రామానికి చెందిన యేడిద వెంకటరత్నం కుటుంబసభ్యులు పీటలపై కూర్చుని కల్యాణం నిర్వహించారు. తెల్లవారు జామున నగర సంకీర్తన, మధ్యాహ్నం గోవిందనామ సంకీర్తన, సాయంత్రం దేవేరులకు పల్లకీ సేవ నిర్వహించారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు



ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

పెనుగొండ: మండలంలోని మునమర్రులో సోమవారం మద్యాన్ని అక్రమంగా విక్రయిస్తున్న నున్న శ్రీను(49) అనే వ్యక్తిని ఎక్సైజ్ అధికారులు అరెస్టు చేశారు. అతడి నుంచి 10 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఎస్సై ఆర్.మధుబాబు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఎక్కడైనా అక్రమంగా మద్యం అమ్మకాలు చేసినా, బెల్ట్‌షాపులు నిర్వహించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎస్సై మధుబాబుతోపాటు హెడ్ కానిస్టేబుళ్లు కె.శ్రీనివాస్, శ్రీమన్నారాయణ, కానిస్టేబుల్ కె.నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేల నిర్వాహకులపై కేసుల నమోదు

పాలకొల్లు అర్బన్: సంక్రాంతి సంప్రదాయం పేరుతో సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో కోడి పందేలు నిర్వహిస్తున్న పలువురిపై కేసులు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై బి.సురేంద్ర తెలిపారు. కాపవరం, శివదేవునిచిక్కాల, దగ్గులూరు గ్రామాల్లో పలువురిపై కేసులు నమోదు చేసి వీరి నుంచి రూ.3050, మూడు కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

క్రికెట్ టోర్నీ విజేత చెరుకువాడ పెదపేట

ఉండి: మండలం చెరుకువాడలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నిర్వహించిన సంక్రాంతి క్రికెట్ కప్ టెన్నిస్‌బాల్ టోర్నమెంట్‌ను చెరుకువాడ పెదపేట సీబీఎన్‌సీ యూత్ సభ్యులు గెలుపొందారు. ఈ నెల 10వ తేదీ నుంచి ప్రారంభమైన ఈ టోర్నమెంట్‌లో చెరుకువాడ, అర్తమూరు, కలసిపూడి గ్రామాల నుంచి ఆరుజట్లు పాల్గొన్నాయి. ఈ టోర్నమెంట్‌లో గెలుపొందిన పెదపేట జట్టుకు చెరుకువాడ గ్రామ సర్పంచ్ కొండవేటి సాంబశివరావు రూ.12 వేల బహుమతిని అందజేసారు. రెండవస్థానంలో నిలిచిన చెరుకువాడ జెర్సీటీమ్ జట్టుకు రూ.7,500 యర్రింకి బుజ్జి, మూడవస్థానంలో లిచిన జట్టు నాన్నకుప్రేమతో టీమ్‌కు రూ.5,000 బహుమతిని స్థానిక జనసేన నాయకులు అందజేసారు. సర్పంచ్ సాంబశివరావు,పాస్టర్ నక్కా జార్జ్‌ముల్లర్ మాట్లాడుతూ పండుగలను పురస్కరించుకుని మంచి మంచి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

సంప్రదాయంగా భోగి పండుగ



గొబ్బిళ్ల పూజ నిర్వహిస్తున్న యువతి



భోగి మంటలో పిడకలు వేస్తున్న చిన్నారులు



భోగి మంటకు నమస్కరిస్తున్న యువతులు

యలమంచిలి: తెలుగు వారి పండుగల్లో సంక్రాంతి పెద్ద పండుగ. ధాన్యం సొమ్ము చేతికి వచ్చిన తరువాత వచ్చే మొదటి పండుగ కావడంతో భోగి, సంక్రాంతి, కనుమ, ముక్కనుమ పండుగలను తెలుగు ప్రజలు ఆనందంతో నిర్వహించుకుంటారు. ముఖ్యంగా భోగి పండుగ రోజున ఉదయాన్నే తల స్నానం చేసి నూతన వస్త్రాలు ధరించి, భోగి మంట చుట్టూ తిరిగి మంటలో ఆవు పిడకలు వేయడం, చిన్న పిల్లల తలపై భోగి పళ్లు పోయడం, వయస్సుకు వచ్చిన యువతులతో గొబ్బిళ్ల పూజ చేయించడం, సంక్రాంతికి ఇళ్లకు వచ్చే హరిదాసులకు, గంగిరెద్దులకు స్వయంపాకం ఇవ్వడం ఆనవాయితీ. పట్టణాలు, నగరాల్లో క్రమక్రమంగా ఈ సంస్కృతి తగ్గిపోతున్నా గ్రామాల్లో ఇంకా ఈ పద్ధతులను అనుసరిస్తున్నారు. ఈ విధంగా సోమవారం భోగి సందర్భంగా గ్రామాల్లో ఈ సనాతన సంప్రదాయాన్ని అనుసరించారు.

ఘనంగా వేడుకలు

నరసాపురం రూరల్: భోగి పండుగను మండలంలో సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. సోమవారం వేకువ జాము నుంచి పలువురు యువకులు పెద్ద పెద్ద దుంగలు, చెట్ల కొమ్మలను భోగి మంటలకు సిద్ధం చేశారు. పలు కూడళ్లలో భోగి మంటలను ఏర్పాటు చేశారు. చిన్నారుల చేత భోగి దండలను మంటల్లో వేయించి దిష్టి పోవాలంటూ తల్లిదండ్రులు ఆకాంక్షించారు. పలు గ్రామాల్లో చిన్నారులు బొమ్మల కొలువును ఏర్పాటు చేశారు. కొందరు గొబ్బెమ్మలు పెట్టడం, చిన్నారులకు భోగి పళ్లు పోసే వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఇళ్లన్నీ పండుగ శోభను సంతరించుకున్నాయి.

ఆనందోత్సాహాల నడుమ భోగి

పెనుగొండ: ఆచంట, పెనుగొండ మండలాల్లో సోమవారం భోగి పండుగను ప్రజలు ఉత్సాహంగా నిర్వహించారు. పలు గ్రామాల్లో పెద్దపెద్ద భోగి మంటలు వేసి యువత సందడి చేశారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఇతర రాష్ట్రాల నుంచి, విదేశాల నుంచి స్వగ్రామానికి వచ్చిన వారితో గ్రామాల్లో సందడి నెలకొంది. ఉమ్మడి కుటుంబాల వారు భోగి మంటలు, గొబ్బిళ్లాటలతో ఆనందోత్సాహాలతో భోగి పండుగ చేసుకున్నారు.

నటుడు రామ్మోహన్‌రావుకు సత్కారం



కత్తుల రామ్మోహన్‌రావుని సత్కరిస్తున్న పరిషత్ నిర్వాహకులు



అనూహ్యం నాటిక ప్రదర్శనలో ధనుష్‌కోటి పాత్రధారి గుడాల హరిబాబు

పాలకొల్లు అర్బన్: వీరవాసరం మండలం రాయికుదురులో శ్రీ కృష్ణదేవరాయ నాటక పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన నాటిక పోటీల సందర్భంగా పాలకొల్లుకు చెందిన రచయిత, నటుడు, దర్శకుడు, రిటైర్డు ప్రిన్సిపాల్ కత్తుల రామ్మోహన్‌రావుని స్వర్గీయ గోటేటి ప్రసాద్ రంగస్థల పురస్కారం అందజేశారు. పరిషత్ నిర్వాహకులు గోపాలకృష్ణ, గ్రామ పెద్దలు కత్తుల రామమోహన్‌రావును ఘనంగా సత్కరించారు.

ఉత్తమ హాస్యనటుడుగా హరిబాబు

పాలకొల్లు అర్బన్: వీరవాసరం మండలం రాయికుదురులో శ్రీకృష్ణదేవరాయ నాటక పరిషత్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నాటిక పోటీలు ప్రదర్శించారు. ఈ పోటీల్లో పాలకొల్లు నటీనట సంక్షేమ సమాఖ్య కళాకారులు పాల్గొన్నారు. వీరు ప్రదర్శించిన అనూహ్యం నాటిక ఉత్తమ తృతీయ ప్రదర్శనగా ఎంపికైంది. అలాగే ఈ నాటికలో ధనుష్ కోటి పాత్రధారి గుడాల హరిబాబు ఉత్తమ హాస్య నటుడు బహుమతి అందుకున్నట్లు సమాఖ్య అధ్యక్షుడు తాళాబత్తుల వెంకటేశ్వరరావు సోమవారం విలేకరులకు తెలిపారు. అలాగే ఈ నాటికలో రాజేష్ పాత్ర పోషించిన శ్యాంశేఖర్ ప్రత్యేక ప్రోత్సాహక బహుమతి అందుకున్నారు.